
9వ డివిజన్‌లో కొప్పోలు రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


కాలువ నిండిపోయి నిలిచిపోయిన మురుగునీటి ప్రవాహం, పక్కనే వ్యర్థాలు


రైల్వే ఫ్లై ఓవర్ పక్కన నిలిచిన వర్షం నీరు, తొలగించని చెత్త

వానా.. వానా.. వెళ్లిపో..!

- వర్షం అంటేనే భయపడుతున్న ఒంగోలు నగర ప్రజలు
- చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్న రోడ్లు
- వాహనదారులకు తీవ్ర అవస్థలు
- డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటమే కారణం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఒంగోలు సిటీ: సాధారణంగా వర్షం అంటే ఇష్టపడని వారే ఉండరు. కానీ, వర్షం కురిసిన ప్రతిసారీ జలమయమవుతున్న ఒంగోలు నగరంలోని వీధులను చూసి స్థానికులు వర్షం అంటేనే భయపడుతున్నారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం వలన చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న ఓ మోస్తరు వర్షాలకే పలు రోడ్లపై నీరు నిలవడంతో ప్రజలు అవస్థపడుతున్నారు. అంతేగాకుండా ఏ వీధిలో చూసినా కాలువల్లో మురుగు నీరు పేరుకుపోయి వరదనీటి ప్రవాహానికి అడ్డుపడుతోంది. అసలే అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థకు తోడు కాలువల్లో పూడిక తీయకపోవడంతో వర్షం నీటి ప్రవాహం నిలిచిపోయి రోడ్డుపైకి చేరుతోంది. దీంతో వర్షం అంటేనే నగర ప్రజలు భయపడిపోతూ వానా..వానా..వెళ్లిపో అంటున్నారు.

ఒకవైపు వర్షం నీరు..
మరోవైపు మురుగు, చెత్త...

రెండు రోజులుగా నగరంలో కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే కాలువలు పొంగి ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా పలుచోట్ల ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. నగరపాలక సంస్థ అధికారులు పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అనేక చోట్ల వీధులు దుర్భరంగా మారిపోయాయి. ముఖ్యంగా కొత్తపట్నం బస్టాండు సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ పక్కన వ్యర్థాలు తొలగించలేదు. 9, 10 డివిజన్లలో, కొప్పోలులో రోడ్లపై నిలిచిన మురుగునీరు, వర్షం నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ, మురుగు కాలువల్లో పూడికతీత పనులు అరకొరగా ఉంటుండటంతో వర్షం కురిసిన సమయంలో చుట్టుపక్కల ప్రాంతాల వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

రోడ్డుపై గుంతల్లో వర్షం నీరు నిలిచి ప్రమాదాలు...

కొన్నిచోట్ల రోడ్లపై గుంతలు పడి వాటిలో వర్షం నీరు నిలిచి వాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక భాగ్యనగర్ నాలుగోలైన్ ప్రధాన రోడ్డును పైపులైన్ల కోసం తవ్వి మట్టిపోసి వదిలేయడంతో వర్షం కురిస్తే ఆ రోడ్డుపై ప్రయాణించే వారు నరకం చూస్తున్నారు. కొన్నిచోట్ల వాహనాలు అదుపుతప్పి కిందపడుతున్నారు. ఈ రోడ్డులో కేంద్రీయ విశ్వవిద్యాలయం, కృష్ణ మోమోరియల్ స్కూల్ ఉండటంతో పాటు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాంటి రోడ్డును నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు నెలల తరబడి నిర్లక్ష్యంగా వదిలేయడంపై ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. నగర నడిబొడ్డునున్న మార్కెట్ సెంటర్, ఆర్టీసీ డిపో, ట్రంకురోడ్డు, గాంధీనగర్, రాంనగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో సైతం పారిశుధ్యం అధ్వానంగా మారి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి వర్షం నీరు నిలవకుండా చూడాలని, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, రోడ్లపై గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.


కొప్పోలు మెయిన్ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు

సంతనూతలపాడు: స్థానిక గంగా పార్వతీ సమేత త్రిపురాంతకస్వామి శివాలయంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిషాసురమర్దిని అలంకరణలో పార్వతీ అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు ఎస్.బుజ్జిబాబుశర్మ ఆధ్వర్యంలో శివునికి అభిషేకాలు, పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఎండోమెంట్ ఈవో ఎస్.నారాయణరెడ్డి పర్యవేక్షించారు. ఉభయ దాతలుగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ రమణమ్మ దంపతులు, గుమ్మలంపాడుకు చెందిన నెప్పలి సుబ్బారావు, ధనలక్ష్మి దంపతులు, మాదాల శ్రీనివాసరావు, శిరీష దంపతులు వ్యవహరించారు. నవరాత్రి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిస్తున్న పార్వతీ అమ్మవారు

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడేపల్లిలో విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కుమ్మరికుంట సురేష్ మాట్లాడుతూ యాక్ట్ 30/2023 ద్వారా చట్టం చేయబడి జీఓ నంబరు 114 ద్వారా అమలైన కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఎన్నికల కోడ్ దృష్ట్యా ఆగిపోయిందని తెలిపారు. దానిని తిరిగి కొనసాగించాలని, 3,618 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కో చైర్మన్ కె.శ్రీనివాస్, పి.ప్రభుదాస్, బి.వీరయ్య, తదితరులు ఉన్నారు.

నాంచారమ్మతల్లికి శ్రీచక్రం సమర్పణ


నాంచారమ్మతల్లి శ్రీచక్రంను ఊరేగిస్తున్న దాతలు

కొత్తపట్నం: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ నాంచారమ్మ తల్లికి శ్రీ చక్రంను బహూకరించారు. కొత్తపట్నం గ్రామానికి చెందిన కుంతూరి కోటయ్య, సతీమణి వెంకటరమణమ్మ, వారి కుమారుడు నాంచార్లు రాము వారి సొంత నిధులతో సమర్పించారు. శుక్రవారం ఉదయం శ్రీ నాంచారమ్మ తల్లి ఆలయంలో పూజలు చేసి మేళతాళాలతో ఊరేగించుకుంటూ కె.పల్లెపాలెం బీచ్ ప్రాంతంలో సముద్రంలో స్నానం చేయించారు. అక్కడ పూజలు చేసి మళ్లీ కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి శివాలయం వీధి నుంచి శ్రీ నాంచారమ్మ తల్లి ఆలయం వరకు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చారు. ఆలయంలో శ్రీచక్రం ముందు అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పురోహితుడు నరసింహులు మాట్లాడుతూ శ్రీచక్రం చేయించడం వలన గ్రామ ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా పాడిపంటలతో వర్ధిల్లుతారని నమ్మకమని అన్నారు. శ్రీ చక్రం గురించి ఆయన వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంచనాలు తలకిందులు..!

- మద్యం షాపులకు ఊహించిన స్థాయిలో రాని దరఖాస్తులు
- చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 30 శాతం చొప్పున రావాల్సిన దరఖాస్తులు 480
- కానీ, వచ్చింది రూ.349 మాత్రమే..
- దరఖాస్తు ఫీజు ద్వారా ప్రభుత్వానికి రూ.6.98 కోట్ల ఆదాయం
- లైసెన్స్ ఫీజు ద్వారా రూ.10.40 కోట్ల ఆదాయం
- ముగిసిన దరఖాస్తుల గడువు

చీమకుర్తి: మద్యం షాపులకు టెండర్లకు ప్రభుత్వం ఊహించినంత స్పందన రాకపోవడంతో ఎక్సైజ్ అధికారులు డీలాపడ్డారు. మద్యం షాపులకు దరఖాస్తు ప్రక్రియకు శుక్రవారం సాయంత్రం 7 గంటలకు గడువు ముగిసే సమయానికి చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 16 మద్యం దుకాణాలకు మొత్తం 349 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం ఒక్కో షాపునకు సరాసరిన 30 దరఖాస్తులు రావాలి. ఆ లెక్కన 16 దుకాణాలకు 480 దరఖాస్తులు రావాల్సి ఉంటే.. 349 దరఖాస్తులు మాత్రమే రావడంతో ప్రభుత్వానికి దరఖాస్తు ఫీజుల ద్వారా రావాల్సిన ఆదాయం రూ.6.98 కోట్లకు మాత్రమే పరిమితమైంది. లైసెన్స్ ఫీజుల ద్వారా రూ.10.40 కోట్లు ఏడాదికి సమకూరనుంది.

అత్యధికంగా షాపు నంబర్ 42కు 29 దరఖాస్తులు...

చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మొత్తం 16 షాపులు ఉండగా, అత్యధికంగా షాపు నంబర్ 42కు 29 దరఖాస్తులు వచ్చాయి. చీమకుర్తి అర్బన్ పరిధిలో 5, రూరల్ పరిధిలో 4, మద్దిపాడు మండలంలో 3, సంతనూతలపాడు మండల పరిధిలో 4 షాపులు ఉన్నాయి. షాపుల వారీగా వచ్చిన దరఖాస్తులు ఈ విధంగా ఉన్నాయి...


చీమకుర్తి సర్కిల్ ఎక్సైజ్ స్టేషన్

ప్రభుత్వ అంచనాలకంటే తగ్గిన దరఖాస్తులు...

ప్రభుత్వ అంచనాల ప్రకారం ఒక్కో షాపునకు 30 దరఖాస్తులు రావాల్సి ఉండగా, 21.8 శాతం మాత్రమే వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అంచనాల ప్రకారం 480 దరఖాస్తులకుగానూ 349 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలు, దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు కావడం, దరఖాస్తు ఫీజు తిరిగి వచ్చేది కాకపోవడం వంటివి అనుకున్నన్ని దరఖాస్తులు రాకపోవడానికి గల కారణాలుగా తెలుస్తున్నాయి. దాంతో పాటు షాపు వచ్చిన తర్వాత అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు ఉంటాయేమోననే ఆందోళనతో చాలా మంది టెండర్లు వేద్దామనుకున్న వారు కూడా వేయలేకపోయినట్లు స్థానికులు చెప్పుకోవడం గమనార్హం. ప్రభుత్వ ఆదాయానికి గండి పడటానికి కారణం అధికార పార్టీ నాయకుల వేధింపులే కావడం విశేషం.


షాపు నంబర్	దరఖాస్తులు
చీమకుర్తి అర్బన్..	
35	21
36	24
37	19
38	21
39	23
మొత్తం	108
చీమకుర్తి రూరల్..	
40	24
41	28
42	29
43	28
మొత్తం	109
మద్దిపాడు...	
44	25
45	28
46	24
మొత్తం	77
సంతనూతలపాడు...	
47	14
48	15
49	13
50	13
మొత్తం	55

వైభవం.. దసరా ఉత్సవం

దసరా సందర్భంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ఒంగోలు నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు బారులుదీరి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

– ఒంగోలు మెట్రో


మహిషాసురమర్దిని అలంకరణలో లాయర్‌పేట సాయిబాబా ఆలయంలోని రాజరాజేశ్వరీదేవి


కాళికా దేవి అలంకరణలో అమ్మవారు


లాయరుపేట సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరీ దేవికి దీపాల అలంకరణ


గంటాయపాలెం పార్వతీదేవి కళారం ఊరేగింపులో భక్తులు


అంకమ్మపాలెం కాళికాదేవి కళారం

నేత్రపర్వంగా వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేక కార్యక్రమాలు భక్త జన మనో రంజకంగా సాగుతున్నాయి. శ్రీవారి ఊంజల్ సేవ సందర్భంగా శుక్రవారం సాయంత్రం శ్రీగిరి ఆస్థాన మండపంలో ఏర్పాటైన భక్తి సంగీత విభావరి భక్తులను విశేషంగా అలరించింది. ప్రముఖ గాయకులు శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వీవీఎస్ వినోద్ కుమార్ అన్నమాచార్య కీర్తనలను ఆలపించారు. ఆలయ అర్చకులు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారితో పాటు ఉభయ దేవేరులను ముత్యాల హారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి, గాయకుడు వినోద్ కుమార్ ను ఘనంగా సత్కరించారు.

సబ్సిడీపై వంట నూనె విక్రయం ప్రారంభం


సబ్సిడీపై వంట నూనె విక్రయాలు ప్రారంభిస్తున్న ఆర్డీవో

కొత్తపట్నం: సబ్సిడీపై వంట నూనె విక్రయాలను ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న కొత్తపట్నంలోని బస్టాండ్ సెంటర్‌లో గల దీప్తి ప్రొవిజన్స్ (బాలాజీ ప్రొవిజన్స్), హేమంత్ ప్రొవిజన్స్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఆర్డీవోగా ఆమె బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి కొత్తపట్నం వచ్చారు. పామాయిల్ కేజీ రూ.110, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.124 చొప్పున విక్రయించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పెద్ద ఉల్లిపాయలు కేజీ రూ.35కి, టమోటాలు కేజీ రూ.50కి విక్రయించేందుకు సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ వరప్రసాద్‌రావు, వీఆర్వో చంద్రశేఖర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

